తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో 100/- లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# పోలిక

మహీధర రామశాస్త్రి



ఆ ఉదయం ఎనిమిది గంటలకు అప్సరాహోలు దాటి స్టేషను ఎదురుగా నడుస్తూంటే మా రాంపండు ఎదురయ్యేడు. తెల్ల పైజమా, లాల్చీ, ఆకు జోళ్ళు, కంటికి చత్వారం జోడు, బట్టతల - వీడెందు కొచ్చాడు రూర్కెలా? అనుకుంటూ దగ్గరగా వచ్చేక పరిశీలించి చూశాను. నన్ను పలకరించకుండానే ఎదరకు వెళ్ళిపోయాడు రాంపండు. ఒకవేళ రాంపండు కాదేమో? కానీ - ఆ నడకా, మెడ కదలికా అంతా వాడే? మరెందుకు పలకరించలేదు? మేం ఒకరి నొకరం చూసుకొని కొన్ని సంవత్సరాలు అయిపోయింది. సరే లెమ్మనుకుని, బజార్లో కలిసిపోయేను. తర్వాత ఆ సంగతే మరిచిపోయేను.

సోమవారం సాయంత్రం అప్సరా లాడ్జి ముందు నడుస్తూంటే, ఓ టాక్సీ వచ్చి లాడ్జి ముందాగింది. అందులోంచి రాంపండు దిగి లాడ్జిలోకి వెడుతున్నాడు. ఆఫీసు డెస్కులోకన్నా పైజామా లాల్చీ లోనే బాగున్నాడు. వీడిందులో దిగాడన్నమాట. అయినవాళ్ళూ బంధువులూ స్నేహితులకన్నా వింతగా మారిపోతున్నారు.

వాడిని కలుసుకుని సరదాగా మాట్లాడాలని నా కోరిక. కానీ వాడి వాలకం చూస్తే నే వెళ్ళి పరిచయం చేసుకుంటే తప్పుగతిలేనట్టుగ వుంది. వాడు ఏ ఇంజనీరో అయివుంటాడు. ఆస్తులూ అంతస్థులే కాదు ఉద్యోగాలు కూడా మనుష్యుల్ని బాగా ఎడం చేస్తున్నాయి. వాడు ఇంజనీరు

హోదాలో మాట్లాడవచ్చు. ఇరవై ఏళ్ళ క్రిందటి రాంపండులా కాకపోయినా, ఓ స్నేహితుడుగా నయినా మాట్లాడకపోతే మనసుకి కష్టంగా వుంటుంది. పోనిద్దూ అనిపించి ఎదరకు నడిచాను. కానీ మెదడులో ఎక్కడో కాస్త జాగా సంపాదించాడు రాంపండు.

తెల్లారగట్ట మూడింటికి మెళుకువ వచ్చి నప్పుడు రాంపండు మళ్ళా ఆలోచనల్లోకి వచ్చాడు. అర్థం పర్థం లేని ఆలోచనలు తేనెటీగల్లా బాధి స్తూంటే శ్రీమతిని లేపి రాంపండు గురించి చెప్పాను.

"మీరే పలకరించకపోయేరా? ఇంతకీ అత నవునో కాదో? ఇప్పుడీ ధోరణి ఏమిటి? పడు కోండి!"

పిచ్చిది. తనకేం తెలుసు? రాంపండుతో గడిపిన చిన్నతనం గుర్తుకొచ్చింది. వాళ్ళింట్లో క్యారెమ్స్ ఆడేవాళ్ళం. పిచ్చికబుర్లు చెప్పుకుంటూ నవ్వుతూ తుళ్ళుతూ దొర్లించిన రోజులవి. ఆ వాతావరణంలోకి వెళ్ళి రాంపండుతో సంతోషాన్ని పంచుకోవాలని నా కోరిక! నేనే పలకరించి వుండాల్సింది. తీరా దాటవెట్టేశాను. ఇప్పుడేం చెయ్యాలి?

శ్రీమతి బుసలు వినిపిస్తున్నాయి.




మర్నాడు సాయంత్రం అప్సరా లాడ్జి వీధిలో నడిచిపోతూ రాంపండు మళ్ళా కనిపించాడు. వీడి సంగతి తేల్చుకోవాల్సిందే!

"హలో......"

ఇంతకీ ఏమని పలకరించడం?

"ఒరే! రాంపండూ!" అంటే బాగుం టుందా? తీరా కాక పోతే...

"హలో! సార్! సార్! ......"

వాడు ఆగేడు. హమ్మయ్య వాడే! కానీ నన్ను గుర్తు పట్టదేం?

"ఆర్ యూ ఫ్రం ఆంధ్రప్రదేశ్?"

"నో! ఐ యాం ఫ్రం వెస్ట్ బెంగాల్!"

'వెస్ట్‌బెంగాల్' అనడం ఎప్పుడు మానేస్తారో వీళ్ళు!

"సార్! వెరీ వెరీ సారీ! మీరు అచ్చం మా కజిన్ లాగా వుంటేనూ......"

"ఫరవాలేదు. ఇండియన్ కటింగ్ ఒకసారి మన్నిలా మోసంచేస్తూ వుంటుంది. తరతరాలుగా ఇతర రాష్ట్రాలతో సంపర్కం కలిగిన భారత జాతి మనది!"

"మీరన్నది నిజం! రైల్వేలో పని చేస్తూ మా పెదనాన్నగారు జీవితమంతా ఖర్గపూర్‌లోనే గడిపారు!"

"ఐ సీ! బ్రహ్మసమాజ వ్యాప్తికి మా పెదతాతగారు ఆంధ్రదేశం చుట్టపెట్టారు!"

కరచాలనం చేసి, ఆ మనిషి ఎదరకు వెళ్ళి పోయేడు.

ఇంతకీ ఈ సారూప్యతకు కారణం మా పెదనాన్నగారా? ఇతని తాతగారా? ఏమయినా పోలిక దొరికిందని, ఇక మీదట మనుషుల్ని పట్టుకుని పలకరించరాదని గట్టిగానే ఒట్టేసుకున్నాను. ●

బెణుకుల బాధతో తన
గొప్ప రోజు పాడవడం దేనికి?

నయం చేసే శక్తి
మీ చేతుల్లోనే ఉంది.

మీ చేతుల వెచ్చని సౌమ్యమైన స్పర్శ, అయొడెక్స్‌లో గల నయం చేసే శక్తి— ఇవే తనకి కావలసినవి. అందుకే అయొడెక్స్‌ను అందుబాటులో ఉంచుకోండి. ఎందుకంటే అయొడెక్స్‌లో గాయపడిన ధాతువులను నయంచేసే అయొడిన్, నొప్పిని తగ్గించే మిథైల్ శాలిసిలేట్ చేరి ఉన్నాయి.

అయొడెక్స్ రోజుకు రెండుసార్లు రెండింతలు గుణకారి.

నొప్పి తగ్గేవరకూ, ఆ తర్వాత రెండు రోజుల వరకూనూ రోజుకు రెండుసార్లు అయొడెక్స్ వాడమని సిఫారసు చేస్తున్నారు డాక్టర్లు. ఎందుకంటే, నొప్పి ఒక లక్షణం మాత్రమే కాగా అసలు సమస్య లోపలి ధాతువులైన గాయం.

కనుక మీ ఆప్తుల ఎవరైనా బెణుకులు, కండరాల పట్లు, కీళ్ల పట్లు, లేదా ఒళ్లు నొప్పులతో బాధపడటం జరిగితే కాస్త అయొడెక్స్ మర్దించండి. రోజుకు రెండుసార్లు. తమని రెండింతలు శీఘ్రంగా మళ్లీ చురుకుగా చేసినందుకు వారు మీకు ఋణపడి ఉంటారు.




అయొడెక్స్®—నయం చేసే శక్తి గల నమ్మకమైన బామ్.

SKF —ఎస్‌కేఎఫ్ ఉత్పాదన. ELL-1509